
# ఆదివారం స్పెషలు



రేపు మా స్కూల్లో వ్యాస రచన పోటీలుట. ఫస్టు సెకెండు థర్డు ఫారం పిల్లలం 'ఎ' గ్రూపు. హైస్కూలు పిల్లలు 'బి' గ్రూపు. సాయంత్రం నాలుగు నించీ అయిదు దాకా. దేని మీద రాయాలో అప్పటి కప్పుడే చెప్తారుట. ముందుగా తెలిస్తే నాన్నల చేత రాయిం చేసుకుంటాం కదా! అందులో ఎలాగైనా ప్రైజు తెచ్చుకోవాలని నా ఆశ.

దేని మీదడుగుతారబ్బా! బహుశా వార్తా పత్రికలు, గ్రంథాలయములు, విహార యాత్రలు, కత్తి గొప్పదా? కలంగొప్పదా? స్త్రీకి విద్య అవసరమా? ఇలాటివేగా! కానీ అడిగే వాళ్లేదడిగినా అన్నిటికీ పనికొచ్చేలా కొన్నివాక్యాలూసామెతలూ రాసుకునుంచుకుంటే అప్పటికప్పుడు గబుక్కునవాడేసుకోవచ్చు. నాగ్గాపకంవచ్చినంతవరకూ ఒకకాయితంమీద రాసుకుంటున్నా. తల్లిదండ్రులను పూజింపవలెను, గురువే దైవము, విద్యలేనివాడు వింత పశువు, జననీ జన్మభూమి స్వర్గం కన్నా గొప్పవి... ఇలాటివన్నీ.

ఈవేళాదివారం కదా! ఉప్మా పెసరట్లు టిఫిను శుబ్బరంగా మెక్కి చిన్నారీ ఇందూ బుజ్జీ నాన్నా కోవటి దివాళా ఆడుకుంటున్నారు. నేనేవో స్కూలు పాఠాలు

చదువుకుంటున్నాననుకుని అమ్మ వచ్చి ''అచ్చ బంగారాలే! ఇన్నేసేటి చదువులే!'' అంటూ నాతల మీద తడి చేత్తో వూరికే అలా అలా రాసేస్తూ జుట్టంతా రేపేసింది.

అసలెప్పుడో గానీ అమ్మ నన్ను ముట్టుకోనే ముట్టుకోదు. ఇంత గారాం ఎందుకు చేస్తోందబ్బా! ఏమోలేసవిత్తల్లి గాదుగా ఎంతైనా! మొన్నఅలా అడిగానని పాపం కళ్లు ఎర్రబడేలా ఏడ్చింది కూడా!

''ఏం రాసుకుంటున్నావురా! సెలవు పూటా ఇంత కుదురుగా!''

''ఏదో లేవే! స్కూలు సంగతులు. రేపు మాకు వ్యాసరచన పోటీలు'' అన్నా.

''సరే అదయిపోయాక ఓసారి నడవలోకిరా! మంచి మాట చెప్తా'' అంది.

''ఏవిటి? బొబ్బట్లు చేస్తున్నావా?'' అనడిగా.

''అస్తమానం తిండి రంధేనా! ఆడ పిల్లలలా వుండకూడదు. నువ్వురానేచెప్తాగా'' అంటూ వెళ్లి పోయింది. ఎంచక్కా శ్రద్ధగా చదువులాంటిది చేద్దామని నే కూచుంటే ఈవిడగారొచ్చి రహస్యం చెప్తారా అంటే ఇంక నాకు కాలేం నిలబడుతుంది. నిన్న మొన్ననే బట్టలు కుట్టించింది. నిన్న మొన్న సెలవల్లోనే తాతగారూరెళ్లొచ్చాం,ఏంటో మరి!

సందులో హాయిగా మడత మంచం వాల్చుకుని మోచెయ్యి ఆనించుకుని వత్తిగిలి పడుకుని నా కోసం గుమ్మంకేసి చూస్తోంది. నే రాగానే పొట్ట దగ్గిర కూచోపెట్టుకుంది. ఈవేళ ఉప్మా పెసరట్టాదివారం కదా! అందుకని అమ్మకి మధ్యాహ్నంపెద్ద వంట పనుండదు. అన్నం ఒక్కటే చేస్తుంది. అందరూ ఆవకాయ పెరుగు తినాల్సిందే ఏరెండింటికో!

''నాని బంగారాలూ! మనం సినిమాకెళ్లి ఎన్నాళ్లయిందే?''

''అదా సంగతి నా తల్లీ! దొరికావు. ఎందుకా వున్నట్టుండి నన్ను పిలిచావనుకున్నా! కిందటాది వారం కాక ఆ ముందటి వారం. పదిహేను రోజులయిందేమోనే'' అన్నా.

''కాదు పిచ్చీ! మధ్యలో రెండాదివారాలు వెళ్లి పోయాయి. నువ్వేమో కొత్త క్లాసు హడావిడిలో పడి మర్చేపోయావు! మహాబాగు అన్నట్లు నాన్న ఆ విషయవే ఎత్తట్లేదు!''

''అవును నిజమేనే. మనందరం సినిమాకెళ్లి చాలా రోజులయింది. కానీనాన్నతో నువ్వు మాట్లాడేందుకు నా రికమెండేషను కావాలా? నా పేరెందుకు బయటికి రావాలి? నీకు వెళ్లాలనుంటే నువ్వే అడుక్కో. నేనసలే వ్యాసరచన పోటీకి తయారవాలి కదా!''

''నీకు బోల్డుసూక్తులుసామెతలు నిమిషంలోనేచెప్తాగా! నేను గానీసినిమాకెడదావంటే నాన్న ఇంగ్లీషు సినిమా అంటారు. దేవదాసు చూడాలనుందంటే అసలు వినరు. అది ఏడుపు సినిమాట.''

''నాన్న నా మాట మాత్రం వింటారేంటమ్మా! అయినా ఏడుపు సినిమా చూడాలని

నీకు సరదా ఎందుకు?''

'' ఆ సినిమా బాగుంటుందే! నాన్న నొప్పించే పూచీ నీది. రాత్రి బోయినాల లోకి పాయసం చేసే పూచీ నాది. సరేనా?'' వెంటనే బయలుదేరా.

''నాన్నా! మాకిచ్చిన మాటలన్నీ మర్చిపోయి ఏవిటా పేకాట అసయ్యంగా!''

''అమ్మ చెప్పిందేవిటే నీకు? అలా మాట్లాడాలని!''

''అమ్మేం చెప్పలా! నాకు రాదేవిటి ఎలా మాట్లాడాలో! పోనీమని మంచి నాన్నవి కదాని మేం అట్టే గొడవ పెట్టకుండా వుంటే మూడాదివారాలు వెళ్లిపోయినా సినిమా పేరెత్తరు! అన్నీ నేనే చెప్పాలి!''

'' ఆల్‌రైట్‌రా బాబా! నీమాటే కానిద్దాం. ఏ సినిమా అయినా సరే దేవదాసు తప్ప!''

''మనకదే వీలు నాన్నా! మావయ్యగారి చేత ఫోను చేయిస్తే టిక్కెట్లుంచుతారు! రిక్షా ఖర్చుండదు.పైగా అమ్మకి అదే చూడాలనుందిట.'' సరేనని నాన్నని ఒప్పించాను. ఇంకపాపం అమ్మ మేం అన్నాలు తినడం అవగానే పాయసం చేసి నాకు చూపించి మరీ అలమర్లో పెట్టింది, ఆగిన్నె కింద నీళ్ల కంచం పెట్టి . నాలుగవ గానే ఒక్కొక్కళ్లమే జడలేసుకుని సినిమాకని తయారవుతున్నాం. ఇంతట్లోకీ చంద్రావొచ్చాడు సైకిలు తొక్కుకుంటూ యములాడిలా!

'' ఏం నాయనా ఆదివారం అయిదింటికి సైకిలెక్కి రొప్పుకుంటూ మరీ వచ్చావు ! ఏదైనా సినిమాకు అఘోరించకపోయావా'' అడిగేశా !

''ఏం సినిమా కెళ్దారండి పాపమ్మ గోరూ ! సిమెంటు లారీలొత్తాయని నన్నక్కడ కూకో బెట్టేశారు కదా ! విజీవాడ్నించి రెండు లోడ్లొచ్చేసినాయ్. సెప్దారని వచ్చినా!'' నేవెనక్కి తిరిగి చూసేటప్పటికే నాన్న పాంటు షర్టు మార్చేసుకుని, ''చంద్రరావూ! సైకిలు నాకిచ్చేసి నువ్వు నడిచి రారా!'' అని ఇప్పుడే వచ్చేస్తానని, రయ్యని వెళ్లిపోయారు. ఇంకేవుంది ! సినిమా టయిం అయిపోయినా నాన్న పత్తాలేరు. దేవదాసు కాస్తా కొండెక్కాడు. నాకెంత చిరాకొచ్చేసిందో. మేం సినిమా కెళ్లాక ఆ లారీలు తగలడితే ఈ వెధవ మా కోసం సినిమాహాళ్లన్నీ వెతికేవాడా ! కోపంగా వెళ్లి వీధిగది కిటికీలో కూచున్నా.

''అనుకోకుండా పని పడితే నాన్న మాత్రం ఏం చేస్తారే పాపం ! మళ్లీ ఆదివారం వెడదాంలే! నీ వ్యాస రచన పోటీలున్నాయన్నావుగా ! పాయింట్లు రాసుకో నే చెప్తా!'' అమ్మ సర్దబోయింది.

''ఏం అక్కర్లా! నేనెప్పటికీ అస్సలు సినిమాలే చూడను. మీతో కలిసి అస్సలు చూడను. వార్తలు వినాలి పార్కుకెడుతున్నా! నాన్నొచ్చాక కనపడమను!''

''ఎంత పొగరే నీకు ! నాన్న నీకు కనబడాలా ? సరయితే ! అక్కడేపడుండు ! నే రమ్మనే

దాకా రాకు.''

పరిగెత్తుకుంటూ పార్కు్కెళ్లా. అప్పటికే వార్త లొచ్చేస్తున్నాయి రేడియో గొట్టంలో. నేనసలు వార్తలు వినసే వినను. అవి వింటూ తలెత్తి గొట్టం కేసే చూస్తూ నిలబడుంటారే పెద్ద వాళ్లంతా వాళ్లని చూడ్డం నాకు భలే సరదా. ఎవరైనా వార్తలు మొఖంతో వింటారా, మెడలు నొప్పెట్టేలా ? అయినా నాకెందుకులే ఎవరి వీలు వాళ్లది. చీకటి పడిపోయింది. పిల్లలందరూ ఇళ్లకెళ్లి పోయారు. నేనొక్క దాన్నే బెంచీ మీద కూచునున్నా. ఇంకాసేపు ఇలాగే కూచుంటే భయం కూడా వేస్తుంది ! అమ్మేమో ఇక్కడే పడుండమందిగా ! నే వెళ్లిపోతే ఎంత పరువు తక్కువ? అమ్మయ్య! ప్రభువు చల్లగా చూసినట్లున్నాడు. చంద్రావొచ్చాడు.

''అయగారు తమర్నింటికి తీసుకురామ్మని అంపేరండి''

''ఆయన్నే రమ్మను! నన్నమ్మిక్కడే పడుండమంది.''

పది నిమిషాల్లో నాన్న వచ్చారు. ''ఏంట్రా నానీ ! ఈ అల్లరి. మిగతా వాళ్లంతా నీలా పేచీ పెడుతున్నారా ? మళ్లీ ఆదివారం వెడదాంగా! పద మరి!''

''అందరి బదులూ పేచీలు పెట్టేదాన్నని పేరు తెచ్చుకునేందుకు నేనున్నాగా నాన్నా ! వాళ్లకేం పట్టిందీ ! ఆదివారం నాడు నేననుకున్నది జరగకపోతే వారం అంతా నాకలాగే వుంటుంది. రేపు వ్యాసరచన పోటీలో ప్రైజే రాదు. మీరిప్పుడీ చంద్రిగాడ్ని హాలుకి పంపి రెండో ఆట టిక్కెట్లు తెప్పిస్తేనే ఇంటి కొస్తా ! లేపోతే లేదు!'' నాన్నతో అయితే ఏదైనా చెప్పెయ్యచ్చు. పెద్ద ప్లానెయ్యక్కర్లా.

''నీకన్నీ అమ్మ బుద్దులేనే ? ఒరే చంద్రరావ్, రెండో ఆటకి అయిదు కుర్చీ టిక్కెట్లు తీసుకురా!'' వాడికి నాన్న డబ్బులిచ్చాక అప్పుడు లేచా.

''నాన్నా మీరిద్దరూ ఎవరికి వాళ్లు తిన్నగా తిట్టుకోండి. అంతేగానీ అన్నీ నాన్న బుద్దులే అని అమ్మా, అన్నీ అమ్మ బుద్ధులే అని మీరూ అంటే నే పడేది లేదు. అసలే పెద్దదాన్ని కూడా అవుతున్నా!''

నేనూ నాన్నా ఇంటికెళ్లేటప్పటికి అమ్మ అప్పుడే వంటిల్లు కడిగేసి వంటంతా మధ్య గదిలో పెట్టింది. మంచాలు పక్కలు అన్నీ రెడీగా వున్నాయి. చివరికి నాన్న మంచం కింద మంచినీళ్ల చెంబు కూడా పెట్టించింది. తాళం కప్పా చెవీ వీధి గుమ్మానికి తగిలించింది. నే సాధించు కొస్తానని ఈవిడకి తెలియదంటే ఎవరు నమ్ముతారు ?